సాక్షి
జనగామ
సోమవారం । 23 । జనవరి । 2023



పథకాలను అడ్డుకుంటున్న కేసీఆర్
కేంద్ర ప్రభుత్వ పథకాలు రాకుండా సీఎం కేసీఆర్ అడ్డుకుంటున్నాడని కేంద్ర సహాయ మంత్రి బీఎల్ వర్మ అన్నారు.
- 8లో▸



పట్నం.. పరవశం
'కోరమీసాల స్వామి.. మమ్ము దీవించు.. మా మొక్కులు స్వీకరించు'.. అంటూ భక్త జనం పారవశ్యంలో మునిగిపోయింది.
- 8లో▸

గరిష్టం/కనిష్టం
$29^0/17^0$

వాతావరణం
ఉదయం మంచుతోకూడిన చల్లని వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం ఉష్ణోగ్రతలు కాస్త తగ్గుతాయి. రాత్రి పూట చలి తీవ్రత మరింత పెరుగుతుంది.

సాహితీ సౌరభం..

దివంగత కవులు, కళాకారుల చరిత్ర గ్రంథస్తం..!
వివరాలతో క్యాలెండర్ రూపకల్పన
ఈతరం ఔత్సాహికులకు స్ఫూర్తిదాయకం

కవులు, కళాకారులకు పూర్వ వైభవం తీసుకురావాలనే సంకల్పంతో 'జనగామ జిల్లా కవులు కళాకారుల ఐక్యవేదిక' ఏర్పాటు చేశారు. ఈ వేదిక ద్వారా జిల్లాలో ఆదరణకు నోచుకోని కవులతోపాటు కొత్త వారిని ప్రోత్సహిస్తున్నారు. నాటి చారిత్రక పోరాటాల్లో ముఖ్యభూమిక పోషించి.. నేటితరం పిల్లలకు తెలియకుండా ఉన్న కవుల చరిత్రను గ్రంథస్తం చేసే ప్రయత్నంతోపాటు.. వారి జయంతి, వర్ధంతి కార్యక్రమాలను నిర్వహిస్తూ.. పూర్వ వైభవం దిశగా అడుగులు వేస్తున్నారు.

- జనగామ



సంస్కృతీ సంప్రదాయాలు, కళలు, కవులు, కళాకారులు, పోరాట యోధులు, కలం వీరులు, వీర జవాన్లు ఇలా ప్రతి రంగంలోనూ జిల్లాకు ప్రత్యేకత ఉంది. ఆదికావ్యం రామాయణాన్ని రచించిన వాల్మీకి, తెలుగు సాహిత్య చరిత్రలో పాల్కురికి సోమనాథుడు, దిక్కారస్వరం బమ్మెర పోతన జనగామ బిడ్డలే. అస్తిత్వ పోరాటాలను ముందుండి నడిపించిన ఈ ప్రాంత కవులకు గుర్తింపు లేకపోవడంతో వేలాది కవిత్వాలు మరుగునపడి పోతున్నాయి. ఈ నేపథ్యంలో 'జనగామ జిల్లా కవులు, కళాకారుల ఐక్యవేదిక'కు పునాది పడింది. కవులు, కళాకారులకు పూర్వ వైభవం తీసుకురావాలనే సంకల్పంతో ప్రముఖ ప్రజా, రేడియో, టీవీ కళాకారుడు జి.కృష్ణ(కన్వీనర్), కవి, గాయకుడు పెట్లోజు సోమేశ్వరాచారి(కోకన్వీనర్) ముందుకు వచ్చారు. నూతనంగా స్థాపించిన వేదిక ద్వారా కళా, సాహిత్య కార్యక్రమాలు విరివిగా నిర్వహిస్తూ పునరుజ్జీవం పోస్తున్నారు.

దివంగత కవుల క్యాలెండర్..

సాహిత్యంతో ప్రజల్లో చైతన్యం కలిగించిన స్ఫూర్తి మూర్తుల చరిత్ర చాలామందికి తెలియదు. అలాంటి జిల్లా కవులు, కళాకారుల చరిత్రను పదిలంగా కాపాడేందుకు మొదటిసారిగా దివంగత కవుల క్యాలెండర్ రూపొందించారు. ముఖ్యంగా రంగరాజు కేశవరావు, కేశిపెద్ది నరసరాజు, గంగుల శాయిరెడ్డి, రామానుజపురం రంగనాథస్వామి, డాక్టర్ చొల్లేటి నరసింహ రామశర్మ, చొల్లేటి నరసింహశర్మ, పానుగంటి వెంకటకిష్టయ్య, గుజ్జుల వీరయ్య, పురుమాండ్ల యాదగిరి, నల్ల నరసింహులు, అంబాల మల్లాగౌడ్, వయ్యా రాజారాం, వంగ నర్సయ్య, మామిండ్ల సాయిలు, శ్రీభాష్యం శ్రీనివాసాచార్య, అనంతోజు బ్రహ్మయ్య, కేశిపెద్ది నారాయణరాజు, చిట్టిమల్లె శంకరయ్య(రుద్రశ్రీ), పేర్వారం జగన్నాథం, చుక్క సత్తయ్య, గంగుల నారాయణరెడ్డి, పార్శి వెంకటేశ్వర్లు, నూతి నర్సయ్య పంతులు, కడారి మల్లయ్య, అయిలా పండరీనాథ్, చౌడవరం విశ్వనాథం, ప్రతికంఠం మధుసూదన్‌రాజు, డాక్టర్ వేణుముద్దల నరసింహారెడ్డి, గంగరాజు సుశీలాదేవి, చక్రవర్తుల రాఘవాచారి, ఈటూరి రాధాకిషన్‌రావు, జి.వై.గిరి, కావేరి గోపయ్య, గంగరాజు దామోదర్‌రావు, పెట్లోజు వెంకటాచారి, గంగం సిద్ధారెడ్డి, రామానుజం జీయర్ స్వామి, కడింగుల రాం నర్సయ్య తదితర 55 మంది కవుల పేర్లు.. వివరాలను సేకరించేందుకు ఐక్యవేదిక ఆరునెలల పాటు కష్టపడింది. అలాగే ముదిగొండ విరుపాక్షయ్య, మరింగంటి లక్ష్మణదేశీకులు, రాగి నరసింహులు, తాండవ కృష్ణయ్య, మచ్చ రాములు పంతులు తదితరుల.. జయంతి వర్ధంతుల సమాచారం సేకరిస్తున్నారు. ఇందుకు ప్రముఖ కవులు డాక్టర్ లింగంపల్లి రామచంద్ర, డాక్టర్ రాపోలు సత్యనారాయణ, రెడ్డి రత్నాకర్‌రెడ్డి, సాంబరాజు యాదగిరి, కోడం కుమారస్వామి, సాధిక్ అలీ, కొలిపాక బాలయ్య, పొట్టబత్తిని భాస్కర్, గద్దం మనోజ్‌కుమార్, మామిండ్ల రమేష్‌రాజా, జంగ వీరయ్య, లగిశెట్టి ప్రభాకర్, మోకాటి నాగరాజు, మీసాల సుధాకర్, రేషపల్లి భానుచందర్, నిమ్మ జయపాల్‌రెడ్డి, గంగరాజు శ్రీనివాసరావు సంపూర్ణ సహకారం అందించారు. క్యాలెండర్ ముద్రణ, ఆవిష్కరణ సభకు ప్రజావైద్యులు, బమ్మెర పోతన సాహిత్య వేదిక వ్యవస్థాపకుడు కల్నల్ డాక్టర్ మాచర్ల భిక్షపతి ఆర్థిక సహకారం అందించారు.


జనగామ కవులు, కళాకారుల ఐక్యవేదిక సభ్యులు

వర్ధంతి, జయంతులను ప్రభుత్వమే నిర్వహించాలి



దివంగత కవుల క్యాలెండర్ ముద్రించడంతో పని ముగిసిపోలేదు. కవులు, కళాకారుల వివరాలతో సమగ్ర సాహిత్య చరిత్రను పుస్తకరూపంలో తీసుకు వచ్చి గ్రంథస్తం చేయాలి. మహనీయుల ప్రతిభను వికీపీడియాలో చేర్చి ప్రపంచానికి తెలియజేయాలి. దివంగత కవులు, కళాకారుల వర్ధంతి, జయంతి కార్యక్రమాలను ప్రభుత్వమే నిర్వహించాలి. జిల్లాలో మిని ట్యాంక్ బండ్ నిర్మాణం జరిగితే వీరి విగ్రహాలు ప్రతిష్ఠించాలి.

- జి.కృష్ణ, కవులు, కళాకారుల ఐక్యవేదిక కన్వీనర్, జనగామ

కళలు, సాహిత్యమంటే మక్కువ..



ధిక్కార కవి పోతన నడయాడిన నేల బమ్మెరలో జన్మించాను. కవులు, కళాకారులు, కళలు, సాహిత్యమంటే మక్కువ. మరుగునపడిన సాహిత్యకారులను వెలికితీయాలనే ఆలోచన క్యాలెండర్ ముద్రణ వైపు ఆలోచింపజేసింది. శ్రమతో కూడుకున్న ఈ యజ్ఞంలో నేను ఒక సమిదను కావాలనుకున్నాను.

- కల్నల్ డాక్టర్ మాచర్ల భిక్షపతి, బమ్మెర పోతన సాహిత్య వేదిక, జనగామ

కళావేదిక లేకపోవడం వెలితిగా ఉంది..



చారిత్రక, సృజనాత్మకమైన రచనలు చేసిన మహాకవులకు నిలయమైన జనగామలో సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు ఒక కళావేదిక లేకపోవడం వెలితిగా ఉంది. ఈ దిశగా మేము ప్రభుత్వాన్ని సాయం చేయాల్సిందిగా కోరుతున్నాం.

- పానుగంటి రామమూర్తి, జిల్లా అధ్యక్షుడు, తెరసం

గొప్ప ప్రయోగం



జిల్లాకు చెందిన దివంగత కవుల క్యాలెండర్ రూపకల్పన సాహిత్య చరిత్రలో గొప్ప ప్రయోగం. కవులు కళాకారుల ఐక్యవేదికను రాష్ట్ర స్థాయిలో విస్తరింప జేస్తాం. మిగితా జిల్లాల సాహితీ కళా సంస్థలను సమన్వయం చేసి ఆయా జిల్లాల్లోనూ క్యాలెండర్ రూపకల్పనకు కృషి చేస్తున్నాం.

- అయిలా సోమనర్సింహాచారి, అధ్యక్షుడు, జనగామ రచయితల సంఘం

విద్యార్థి దశలోనే లక్ష్యాలు ఎంచుకోవాలి

మైనార్టీ గురుకుల పాఠశాలల రాష్ట్ర కార్యదర్శి షఫీఉల్లా


సమావేశంలో మాట్లాడుతున్న షఫీఉల్లా

స్టేషన్‌ఘన్‌పూర్: విద్యార్థి దశలోనే భవిష్యత్ లక్ష్యాలు ఎంచుకుని అందుకు తగినట్టుగా ప్రణాళికతో ముందుకు సాగాలని మైనార్టీ గురుకుల పాఠశాలలు, కళాశాలల రాష్ట్ర కార్యదర్శి షఫీఉల్లా అన్నారు. నమిలిగొండ శివారులోని మైనార్టీ బాలికల గురుకుల ఆశ్రమ పాఠశాల, కళాశాలను ఆయన ఆదివారం సందర్శించారు. పరిసరాలతోపాటు పాఠశాలలో విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. పిల్లలు ప్రయోజకులు కావాలనే ఉద్దేశంతో తల్లిదండ్రులు ఎంతో కష్టపడి చదివిస్తారని, విద్యార్థులు గుర్తించాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుంటూ చదువులో రాణించి తల్లిదండ్రులు, గురువులకు పేరు తేవాలని కోరారు. కార్యక్రమంలో డీఎండబ్ల్యూఓ ఇస్మాయిల్, ఆర్ఎల్‌సీ శ్రీపాల, పాఠశాల ప్రిన్సిపాల్ మాధవీలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చే గువేరా కుమార్తెను కలిసిన సాధిక్ అలీ


అలైదా గువేరాను సన్మానిస్తున్న సాధిక్ అలీ

జనగామ రూరల్: క్యూబా విప్లవవీరుడు చే గువేరా కుమార్తె అలైదా గువేరా, మనుమరాలు ఎస్టేఫానియా గువేరాలను సాధిక్ ఫౌండేషన్ చైర్మన్ సాధిక్ అలీ ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో కలిశారు. ఈ సందర్భంగా వారిని ఘనంగా సన్మానించారు.

న్యూస్‌రీల్

నేటి ధర్నాను విజయవంతం చేయాలి

జనగామ రూరల్: జనగామ పట్టణంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం మున్సిపల్ కార్యాలయం వద్ద నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని సీపీఎం పట్టణ కార్యదర్శి జోగు ప్రకాష్ కోరారు. మున్సిపల్ వార్డుల్లో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయని, అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. మురికి కాల్వల్లో నీరు నిలిచి దోమలు వృద్ధి చెందుతున్నాయని, పారిశుద్ధ్య పనులు చేపట్టకపోవడంతో వార్డుల న్నీ చెత్తతో నిండిపోయాయని అన్నారు. ఏసీ రెడ్డినగర్, ఇందిరమ్మ ఇళ్లు పట్టణానికి దూరంగా ఉండడంతో ఆయా ప్రాంతాలకు జవాన్‌లు, కార్మికులు రావడం లేదని పేర్కొన్నారు. ఈ ధర్నాకు కార్యకర్తలు, ప్రజలు తరలిరావాలని ఒక ప్రకటనలో కోరారు.

పెట్రోల్ ఉచితం.. ఎగబడ్డ జనం



రఘునాథపల్లి: ఇండియన్ ఆయిల్ కంపెనీ వారు ద్విచక్ర వాహనదారులను ఆకర్షించేందుకు ఆదివారం రూ.50 పెట్రోల్ ఉచితమని ఆఫర్ పెట్టారు. దీంతో మండల పరిధి నిడిగొండ శ్రీ సాయిరాం పెట్రోల్ బంకు వద్ద వాహనదారులు ఎగబడ్డారు. చుట్టు పక్కల గ్రామాలకు చెందిన వారు అక్కడికి చేరుకోవడంతో నిర్వాహకులు పేర్లు, ద్విచక్రవాహనం నంబర్ నమోదు చేసుకొని ఉచితంగా పెట్రోల్ పోశారు.

ప్రతి గ్రామంలో పార్టీ జెండా ఎగరాలి

జనగామ: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 26న జిల్లాలోని అన్ని గ్రామాల్లో జాతీయ జెండాతో పాటు కాంగ్రెస్ జెండా ఎగుర వేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు జంగా రాఘవరెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. జాతీయ జెండా ఎగుర వేసిన తర్వాత బీఆర్ఎస్ అధికారంలోకి రాకముందు ఇచ్చిన హామీలను డోర్ స్టిక్కర్స్, కరపత్రాలతో ఇంటింటా ప్రచారం చేసి ప్రజలను చైతన్యం చేయాలని కోరారు. కాంగ్రెస్ హయాంలో ప్రజలకు చేసిన మంచి పనులు, సంక్షేమ, ఇచ్చిన హామీల అమలును సైతం వివరించాలన్నారు. అనుబంధ సంఘాల ప్రతినిధులు, కౌన్సిలర్లు, బ్లాక్ కాంగ్రెస్, మండల పార్టీ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ఈ వేడుకల్లో పాల్గొనాలని కోరారు.

కేంద్రం నిధులపై బహిరంగ చర్చకు రావాలి..



జనగామ: రాష్ట్రానికి కేంద్రం నుంచి వస్తున్న నిధులపై బహిరంగ చర్చకు రావాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంతరెడ్డి.. స్థానిక ఎమ్మెల్యేకు సవాల్ విసిరారు. పార్టీ స్థానిక కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గానుగుపహాడ్‌లో బీజేపీపై ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామని, తీవ్ర పద జాలం వాడడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుతం గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి కేవలం కేంద్రం ఇస్తున్న నిధులతోనే అన్న విషయం గుర్తుంచుకోవాలన్నారు. తమ కార్యకర్తలు తలుచుకుంటే గ్రామాల్లో తిరగలేరని హెచ్చరించారు. సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఉడుగుల రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి సౌత రమేష్, ప్రచార కార్యదర్శి పెద్దోజు జగదీష్, పట్టణ ప్రధాన కార్యదర్శి సంపత్‌కుమార్, చంద్రయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య కిట్లకు బదులు నగదు

- ఒక్కో కిట్టుకు రూ.100 చొప్పున.. కేజీబీవీ విద్యార్థినుల ఖాతాల్లో జమ
- ఏడు నెలల మొత్తం ఒకేసారి అందజేత
- వారం రోజుల్లో పూర్తి కానున్న ప్రక్రియ



కేజీబీవీలు	: 12
విద్యార్థినులు	: 2,553
నెలకు ఇచ్చే నగదు	: రూ.100

విద్యార్థినుల వివరాలు:

మండలం	విద్యార్థినులు
తరిగొప్పుల	151
చిల్పూర్	199
జఫర్‌గఢ్	313
స్టేషన్‌ఘన్‌పూర్	276
రఘునాథపల్లి	176
బచ్చన్నపేట	162
జనగామ	206
లింగాలఘణపురం	278
దేవరుప్పుల	214
నర్మెట	117
పాలకుర్తి	267
కొడకండ్ల	194

జనగామ రూరల్: నిరుపేద విద్యార్థులు, అనాథ పిల్లలు, ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న విద్యార్థినులు చదువు మధ్యలో మానేయకుండా ఉండేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు ఏర్పాటు చేసింది. వీటిలో అవసరమైన వసతి సదుపాయాలు కల్పించడంతోపాటు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫామ్, ప్లేట్లు, గ్లాసులు, రగ్గులు, శానిటరీ(ఆరోగ్య) కిట్లు ఉచితంగా అందిస్తామని చెప్పినా క్షేత్రస్థాయిలో పరిస్థితులు అందుకు భిన్నంగా ఉండడంతో విద్యార్థినులు ఇబ్బంది పడుతున్నారు. ఆరోగ్య కిట్లు ప్రతి నెలా సకాలంలో అందకపోవడంతో విద్యార్థినులు తీవ్ర ఇబ్బంది పడాల్సి వస్తోంది. ఈ సమస్యను గుర్తించిన ప్రభుత్వం కిట్లకు బదులు నెలకు రూ.100 చొప్పున నగదు జమచేయడానికి నిర్ణయించింది. ఇందుకుగాను విద్యార్థినుల పేర వ్యక్తిగత బ్యాంకు ఖాతాలు తెరవాలని ఆదేశాలు జారీ చేసింది.

2,553 మంది విద్యార్థినులు

జిల్లాలో 12 కేజీబీవీలు ఉండగా వాటిలో 2,553 మంది విద్యార్థినులు చదువుకుంటున్నారు. కొన్ని విద్యాలయాల్లో ఇంటర్ వరకు ఉంది. ఆయా విద్యాలయాల్లోని ప్రత్యేక అధికారులు పోస్టాఫీస్, బ్యాంకు అధికారులతో మాట్లాడి ఖాతాలు తెరిపించారు. జిల్లాలో ఇప్పటి వరకు 95 శాతం ఖాతాలు ఓపెన్ చేశారు. వారంలో ప్రక్రియ పూర్తి చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ప్రతి విద్యార్థినికి నెలకు రూ.100 చొప్పున గత ఏడాది జూన్ నుంచి ఏడు నెలల మొత్తం ఒకేసారి ఖాతాల్లో జమ చేయనున్నారు. ఇదిలా ఉండగా.. నగదు జమ విషయమై విద్యార్థినుల తల్లిదండ్రుల నుంచి విముఖత వ్యక్తమవుతోంది. నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటుతున్న నేపథ్యంలో ప్రభుత్వం అందించే నగదు ఏమాత్రం సరిపోదని, డబ్బులతోపాటు ఆరోగ్య కిట్లు అందించాలని కోరుతున్నారు.

నేరుగా విద్యార్థుల ఖాతాల్లో జమ



కేజీబీవీల్లో చదివే విద్యార్థినులకు ఆరోగ్య కిట్లకు బదులుగా నెలకు రూ.100 చొప్పున ప్రభుత్వం నేరుగా వారి ఖాతాల్లో జమచేయనుంది. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా అకౌంట్లు తెరిచే ప్రక్రియం చేపట్టాం. 95 శాతం పూర్తయింది. పది రోజుల్లో నూరుశాతం చేయడానికి కృషి చేస్తాం.

- గౌసియాబేగం, జిల్లా సైన్స్ అధికారి

గని కార్మికులు ఐక్యం కావాలి

- టీబీజీకేఎస్ గౌరవ అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత


యూనియన్ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ కవిత, పక్కన మంత్రి సత్యవతి, ఎమ్మెల్యే, నాయకులు

భూపాలపల్లి అర్బన్: సింగరేణి కార్మికులు పొందుతున్న ప్రయోజనాలు మిగతా అన్ని రాష్ట్రాల్లోని గని కార్మికులు పొందాలి.. ఇందుకు అందరూ ఐక్యం కావాలని తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం(టీబీజీకేఎస్) రాష్ట్ర గౌరవ అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పిలుపునిచ్చారు. జయశంకర్ జిల్లా భూపాలపల్లి ఏరియాలో నూతనంగా నిర్మించిన యూనియన్ కార్యాలయ భవనాన్ని ఆదివారం మంత్రి సత్యవతి రాథోడ్‌తో కలిసి ప్రారంభించి మాట్లాడారు. తెలంగాణ ఏర్పడిన తరువాత సింగరేణి సంస్థను అభివృద్ధి చేస్తుంటే.. కేంద్రం కోల్ ఇండియాతోపాటు సింగరేణి బొగ్గు బ్లాక్‌లను ప్రైవేట్ పరం చేస్తూ వస్తోందన్నారు. ఈ కుట్రలను తిప్పికొట్టేందుకు బలమైన సంకల్పంతో ముందుకు వెళ్తున్న సీఎం కేసీఆర్.. కారుణ్య నియామకాల పేరుతో 2016 నుంచి 18 వేల మంది యువ కార్మికులకు ఉద్యోగాలు ఇచ్చారని గుర్తు చేశారు. ప్రతి రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ కీలకంగా పనిచేయబోతోందని, అక్కడి గని కార్మికుల సమస్యలకు పరిష్కార మార్గాలు చూపాల్సిన బాధ్యత సింగరేణి యువ కార్మికులపై ఉంటుందన్నారు. అంతకుముందు జయశంకర్, అంబేడ్కర్ విగ్రహాలకు కవిత పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన యూనియన్ బ్రాంచి ఉపాధ్యక్షుడు కొక్కుల తిరుపతి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఇదిలా ఉండగా.. యూనియన్ భవన ప్రారంభోత్సవ శిలాఫలకంపై ఎమ్మెల్సీ మధుసూదనచారి పేరు లేకపోవడంతో ఆయన వర్గం నాయకులు శిలాఫలకం తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి, రాష్ట్ర వికలాంగుల సంస్థ కార్పొరేషన్ చైర్మన్ వాసుదేవరెడ్డి, జెడ్పీ చైర్ పర్సన్లు జక్కు శ్రీహర్షిణి, గండ్ర జ్యోతి, యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వెంకట్రావ్, రాజిరెడ్డి, కార్యనిర్వాహక అధ్యక్షుడు మల్లయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బుర్ర రమేష్ తదితరులు పాల్గొన్నారు.


గణపురం : ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ కవిత

కోటగుళ్ల అభివృద్ధికి కృషి చేస్తా..

గణపురం: కాకతీయుల కట్టడాలు మహా అద్భుతం.. వారు నిర్మించిన ఆలయాల్లోని శిల్ప కళాసంపద ఇందుకు అద్దం పడుతుందని ఎమ్మెల్సీ కవిత అన్నారు. మండల కేంద్రంలోని కాకతీయుల కళాక్షేత్రం కోటగుళ్లను ఆమె మంత్రి, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, జెడ్పీ చైర్‌పర్సన్ తదితరులతో కలిసి సందర్శించారు. ఆమెకు అర్చకులు పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం కవిత మాట్లాడుతూ.. రాష్ట్రంలోని పురాతన ఆలయాల అభివృద్ధికి సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. స్థానిక ఆలయ నిర్వహణను గ్రామస్తులు, పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో చేపడుతున్నట్లు తెలపడంతో రూ.30 వేలు అందజేశారు. ఆలయంలో జిల్లా ఎస్పీ సురేందర్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు.

పత్తి మార్కెట్లలో దోపిడీని అరికట్టాలి


సమావేశంలో మాట్లాడుతున్న చందునాయక్

జనగామ రూరల్: పత్తి మార్కెట్లలో దోపిడీని అరికట్టి సీసీఐ ద్వారా క్వింటాకు రూ.12వేలు కనీస మద్దతు ధరతో కొనుగోలు చేయాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్య చందునాయక్ డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సంఘం కార్యాలయంలో రాపర్తి సోమయ్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం పత్తికి కనీస మద్దతు ధర రూ.6,380 మాత్రమే ఇస్తుండడంతో రైతులకు గిట్టుబాటు కావడం లేదన్నారు. రైతులకు లక్ష రూపాయాల రుణమాఫీ ఏకకాలంలో చేయాలని, ఎరువులు, విత్తనాలు వందశాతం సబ్సిడీపై ఇచ్చి ఆదుకోవాలని కోరారు. బీరయ్య, మీట్యా నాయక్, యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

● ముగిసిన 'ఫెస్ట్'

నిట్ వరంగల్‌లో మూడు రోజులపాటు నిర్వహించిన యూత్‌ఫెస్ట్–23 ఆదివారం రాత్రి ముగిసింది. స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని స్టూడెంట్ కౌన్సిల్ ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. చివరి రోజు డ్యాన్స్ అండ్ డ్రమటిక్స్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థినీ విద్యార్థులు నృత్యాలతో ఉర్రూతలూగించారు.

- కాజీపేట అర్బన్



- వివరాలు 10లో▸

పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎన్ఆర్ఐ రాజనరేందర్‌రెడ్డి, పాల్గొన్న 1972-73 బ్యాచ్ విద్యార్థులు





యాభై ఏళ్ల ఆత్మీయ సమ్మేళనం

పాఠశాలలో చదువుకున్న నాటి జ్ఞాపకాలు.. ఆప్యాయతగా పలకరింపులు.. జీవితంలో ఎదుర్కొన్న కష్ట సుఖాలను ఒకరికొకరు పంచుకుంటూ.. స్నేహ బంధాన్ని గుర్తుచేసుకున్నారు. పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1972–73 సంవత్సరం పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు సూర్యాపేట రోడ్డున ఉన్న ఓ కన్వెన్షన్ హాల్లో ఆదివారం గోల్డెన్ జూబ్లీ వేడుకలు జరుపుకున్నారు. స్థానికంగా ఉన్న పూర్వ విద్యార్థులతో పాటు దేశ, విదేశాల్లో స్థిరపడిన వారంతా ఒకే వేదికపై చేరడంతో సందడిగా మారింది. తాము చదువుకున్న పాఠశాల అభివృద్ధికి సహకారం అందిస్తామని తీర్మానించారు. ఈ సందర్భంగా ఎన్ఆర్ఐ రాజనరేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యాబుద్ధులు నేర్చుకున్న స్కూల్ అభివృద్ధికి గతంలోనూ సహకరించా.. ఇక ముందుకూడా సహకరిస్తానని చెప్పారు.

- జనగామ

క్లుప్తంగా

ఫారెస్ట్ అధికారులకు నెమలి అప్పగింత



చిట్యాల: జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం వరికోల్ గ్రామానికి చెందిన రైతు నాగరాజు ఆదివారం వ్యవసాయ పనుల నిమిత్తం వెళ్తుండగా నిస్సహాయక స్థితిలో ఉన్న నెమలి కనిపించింది. దీంతో సర్పంచ్ సాంబయ్య, జెడ్పీటీసీ గొర్రె సాగర్‌కు సమాచారం అందించాడు. వారు ఫారెస్ట్ అధికారులకు విషయం తెలిపి నెమలిని రైతు చేతుల మీదుగా అధికారులకు అప్పగించారు.

గంజాయి విక్రయిస్తున్న ముగ్గురు యువకులపై కేసు

మహబూబాబాద్ రూరల్: గంజాయి క్రయవిక్రయాలు, సరఫరా, సేవిస్తున్నారనే సమాచారం మేరకు ముగ్గురు యువకులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు మహబూబాబాద్ టౌన్ ఎస్సై బి.క్రాంతికిరణ్ ఆదివారం తెలిపారు. ఎస్పీ శరత్‌చంద్ర పవార్ ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు, మహబూబాబాద్ టౌన్ సీఐ సతీష్ ఆధ్వర్యంలో గంజాయి కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. జిల్లా కేంద్రంలోని పూలే జంక్షన్ సమీపంలో ముగ్గురు యువకులు వెంకటసాయి, సాయిరాం, కేతన్ అనుమానాస్పదంగా కనిపించడంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. విచారణ అనంతరం ముగ్గురిపై కేసు నమోదు చేశారు.

రైలు ఢీకొని గొర్రెల మృతి



సంగెం: రైలు ఢీకొని గొర్రెలు మృతి చెందిన సంఘటన వరంగల్ జిల్లా సంగెం మండలంలోని చింతలపల్లి స్టేషన్–సంగెం రైల్వే గేట్ మధ్య ఆదివారం రాత్రి జరిగింది. చింతలపల్లి గ్రామానికి చెందిన వల్లెపు కట్టమల్లు, శివరాత్రి నర్సయ్య, అలకుంట ఉప్పలయ్య తమ గొర్రె మందను మేతకు తీసుకెళ్లి ఆదివారం రాత్రి ఇంటికి తోలుకెళ్తున్నారు. చింతలపల్లి స్టేషన్–సంగెం రైల్వేగేట్ మధ్య పట్టాలు దాటుతుండగా చెన్నై నుంచి ఢిల్లీకి వెళ్తున్న మిలీనియమ్ ఎక్స్‌ప్రెస్ గొర్రె మందను ఢీకొట్టింది. ఈ ఘటనలో ముగ్గురికి చెందిన 15 నుంచి 20 గొర్రెలు మృత్యువాత పడ్డాయి.



వివ్యాసాల నడుమ బోనాలతో తరలివెళ్తున్న మహిళలు



గంగరేగు చెట్టు కింద పట్నాలు వేస్తున్న భక్తులు

పట్నం.. పరవశం

- దారులన్నీ కొమురవెల్లికే..
- వైభవంగా మల్లన్న పట్నం వారం
- భక్తులతో రద్దీగా మారిన క్షేత్రం

కొమురవెల్లి(సిద్దిపేట): 'కోరమీసాల స్వామి.. మమ్ము దీవించు.. మా మొక్కులు స్వీకరించు'.. అంటూ భక్తజనం పారవశ్యంలో మునిగిపోయింది. ఆదివారం కొమురవెల్లి మల్లికార్జునస్వామి జాతర అత్యంత వైభవంగా ప్రారంభమైంది. జాతరలో మొదటివారాన్ని పట్నం వారంగా పిలుస్తారు. శనివారం సాయంత్రమే క్షేత్రానికి చేరుకున్న భక్తులు ముందుగా స్వామివారిని దూళి దర్శనం చేసుకున్నారు. ఉదయం కల్యాణ కట్ట వద్ద తలనీలాలు సమర్పించి కోనేరులో స్నానమాచరించారు. గంగరేగు చెట్టు వద్ద పట్నాలు వేసి మల్లన్న నామస్మరణ చేస్తూ మొక్కులు చెల్లించారు. అనంతరం గొల్లకేతమ్మ, బలిజ మేడలమ్మతో కొలువైన స్వామివారిని దర్శించుకున్నారు. పట్నంవారం సందర్భంగా హైదరాబాద్‌తో పాటు పక్కరాష్ట్రాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. ధర్మ దర్శనానికి సుమారు ఆరుగంటల సమయం పడుతున్నట్టు ఆలయ అధికారులు తెలిపారు.

బోనాలతో బారులు

ఆలయ ప్రాంగణంలో కిలోమీటర్ల పొడవునా భక్తులు బారులుతీరారు. ఒంటి నిండా బండారి (పసుపు).. చేతిలో ఈరకోలతో పోతరాజులు చేసిన విన్యాసాలతో ఆలయ పరిసరాలు దద్దరిల్లాయి. బోనాలతో భక్తులు గుట్టపై కొలువైన రేణుక ఎల్లమ్మ గుడికి చేరుకున్నారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మల్లన్న జాతరకు వచ్చిన భక్తులు ఆలయం చుట్టూ 2 కి.మీ మేర విడిది ఏర్పాటు చేసుకున్నారు. భక్తులకు కావాల్సిన సౌకర్యాలను ఏర్పాటు చేయడంలో ఆలయ అధికారులు విఫలం అయ్యారు. వసతి గదులలో ఆదివారం ఉదయం నుంచి విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో నీటి సమస్య తలెత్తి భక్తులు ఇబ్బంది పడ్డారు. అన్నదాన సత్రం సమీపంలో డ్రైనేజీ లీకై మురుగు నీరు రోడ్డుపై ప్రవహించడంతో బోనాలతో వెళ్తున్న భక్తులు కొంత అసౌకర్యానికి గురయ్యారు.

నేడు పెద్దపట్నం, అగ్నిగుండాలు

నేడు (సోమవారం) స్వామి వారి కల్యాణ వేదిక వద్ద పెద్దపట్నం, అగ్నిగుండాల కార్యక్రమాన్ని ఆలయ వర్గాలు నిర్వహించనున్నాయి. ఆలయ సంప్రదాయం ప్రకారం హైదరాబాద్ ఒగ్గు పూజారుల ఆధ్వర్యంలో నిర్వహిస్తారు. పట్నం వారానికి వచ్చిన భక్తులు పెద్దపట్నం, అగ్నిగుండాల కార్యక్రమాన్ని తిలకించి స్వామివారిని దర్శించుకుంటారు. అనంతరం కొండపోచమ్మ ఆలయానికి వెళ్లి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకుంటారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా ఆలయ అధికారులు, పాలకమండలి సభ్యులు ఏర్పాట్లు చేశారు.

పటిష్ట బందోబస్తు

పట్నం వారం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా డీసీపీ (అడ్మిన్) మహేందర్ ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. 273 మంది పోలీసులు, 180 మంది ఎన్‌సీసీ విద్యార్థులు విధులు నిర్వహించారు.



ఆలయంలో మల్లికార్జునస్వామి విగ్రహం

కేంద్ర పథకాలను అడ్డుకుంటున్న కేసీఆర్

- తెలంగాణలో వచ్చేది బీజేపీ ప్రభుత్వమే
- బీఆర్‌ఎస్‌తో ఒరిగేదేమీ లేదు
- కేంద్ర సహాయ మంత్రి బీఎల్ వర్మ

ఆత్మకూరు: తెలంగాణ పేదలకు కేంద్ర ప్రభుత్వ పథకాలు రాకుండా ముఖ్యమంత్రి కేసీఆర్ అడ్డుకుంటున్నారని, కేసీఆర్‌కు పేదల గోస తగులుతుందని కేంద్ర ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి, సహకార శాఖ సహాయ మంత్రి బీఎల్.వర్మ అన్నారు. రాష్ట్రంలో వచ్చేది బీజేపీ ప్రభుత్వమేనని, బీఆర్‌ఎస్‌తో ప్రజలకు ఒరిగేదేమి లేదని పేర్కొన్నారు. హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండల కేంద్రంలోని రైతు వేదికలో ఆదివారం ఆయన స్థానిక రైతులతో సమావేశమయ్యారు. రైతులు తమకు జరుగుతున్న నష్టాలను మంత్రికి వివరించారు. ఏడాది క్రితం అకాల వర్షాలకు పంటలు పాడవగా ఇప్పటి వరకు పరిహారం ఇవ్వలేదని, కనీసం ఫసల్ బీమా యోజన పథకం కూడా అమలు చేయలేదని వాపోయారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను రాష్ట్రంలో అమలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి బీఎల్ వర్మ మాట్లాడుతూ తెలంగాణ రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రధానమంత్రి మోదీ దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో నిర్మించిన రైతువేదిక భవనాల్లో మోదీ ఫొటో పెట్టకపోవడం దారుణమని మంత్రి అన్నారు. రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీని గెలిపించి డబుల్ ఇంజన్ సర్కారును తీసుకురావాలని పిలుపునిచ్చారు. కాగా, మంత్రి ప్రసంగాన్ని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి తెలుగులో అనువదించారు. మంత్రిని డాక్టర్ విజయచందర్‌రెడ్డితో పాటు పీఏసీఎస్ చైర్మన్ ఏరుకొండ రవీందర్‌గౌడ్, డైరెక్టర్ జయపాల్‌రెడ్డి సన్మానించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సురేష్‌కుమార్, ఏఓ యాదగిరి, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కాచం గురుప్రసాద్, మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ పెసరు విజయచందర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు గురిజాల శ్రీరామ్‌రెడ్డి, ఆర్‌పీ జయంత్‌లాల్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కేంద్ర సహాయ మంత్రి బీఎల్ వర్మ

'వల్లంపట్ల'కు గిడుగు రామమూర్తి పురస్కారం

విద్యారణ్యపురి: హనుమకొండకు చెందిన ప్రముఖ కళాకారుడు, కవి, రచయిత డాక్టర్ వల్లంపట్ల నాగేశ్వర్‌రావు గిడుగు రామమూర్తిపంతులు జాతీయ పురస్కారం అందుకున్నారు. నాగేశ్వర్‌రావుకు గిడుగు రామమూర్తి ఫౌండేషన్ వారు ఈ పురస్కారాన్ని ప్రకటించగా హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 21న నిర్వహించిన కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తి డాక్టర్ జి.రాధారాణి, తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు ఆయనకు పురస్కారం ప్రదానం చేశారు. ఫౌండేషన్ అధ్యక్షుడు గిడుగు శాంతికృష్ణ, ప్రధాన కార్యదర్శి కళారత్న, బిక్కి కృష్ణ తదితరులు పాల్గొన్నారు. పురస్కారం అందుకున్న వల్లంపట్ల నాగేశ్వర్‌రావును ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ అయిలయ్య, ప్రొఫెసర్ రతన్‌సింగ్‌ఠాకూర్, ప్రొఫెసర్ కృష్ణమాచారి, వల్లపైడి అభినందించారు.



పురస్కారం అందుకుంటున్న నాగేశ్వర్‌రావు

'ప్రతిమ'లో ఆరోగ్యశ్రీ సేవలు

- ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ ధీరజ్

హసన్‌పర్తి: ఆరెపల్లి శివారు ప్రతిమ రిలీఫ్ ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ ద్వారా 133 రకాల సేవలు అందిస్తున్నట్లు ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ ధీరజ్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ ద్వారా అపెండెక్టమి, ల్యాప్ కోలిసిస్టెక్టమి, హెమీ థైరాయిడెక్టమి, హెర్నియా, లాప్రోస్కోపిక్ సిస్టక్టమి, హిస్టరెక్టమి తదితర చికిత్సలు అందజేస్తున్నట్లు చెప్పారు. ఎంజీఎంలో అందించే అన్నీ సేవలు ప్రతిమ రిలీఫ్ ఆస్పత్రిలో అందుబాటులో ఉన్నాయన్నారు. గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించి రోగులను ఆస్పత్రికి తీసుకొచ్చి వైద్య పరీక్షలు నిర్వహించడం జరుగుతోందన్నారు. అలాగే, ఆస్పత్రిలో ఉచిత ఓపీ సౌకర్యం అందుబాటులో ఉందని పేర్కొన్నారు. అన్ని రకాల వైద్య పరీక్షల్లో రాయితీలు కల్పించినట్లు డాక్టర్ ధీరజ్ తెలిపారు. 50శాతం మేర రాయితీపై పరీక్షలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. లాబోరేటరీ, ఎంఆర్ఐ, ఇతర స్కానింగ్ పరీక్షల్లో కూడా రాయితీ ఇస్తున్నట్లు చెప్పారు. వివరాలకు 91657 75555, 90000 07467 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. సమావేశంలో మేనేజర్ రాజ్‌కుమార్, ఓటీ ఇన్‌చార్జ్ రాజు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ ధీరజ్

సీతారామాంజనేయస్వామి దేవాలయంలో చోరీ

- మూడు హుండీలు పగులగొట్టి నగదు దోచుకెళ్లిన దొంగలు
- కాశిబుగ్గలో ఘటన

కాశిబుగ్గ: వరంగల్ కాశిబుగ్గ ఓ సిటీ రోడ్డులో ఉన్న సీతారామాంజనేయ సహిత హరిహరపుత్ర అయ్యప్ప దేవాలయంలో శనివారం రాత్రి చోరీ జరిగింది. దొంగలు ఆలయంలోని మూడు హుండీల తాళాలు పగులగొట్టి నగదును దోచుకెళ్లారు. వివరాలిలా ఉన్నాయి. శనివారం అర్ధరాత్రి గుర్తు తెలియని దొంగలు ఆలయంలోకి చొరబడి ధ్వజ స్తంభం, పెద్ద హనుమాన్ విగ్రహం, అయ్యప్ప స్వామి ఆలయం ఎదురుగా ఉన్న మూడు హుండీల తాళాలు పగలగొట్టి వాటిలోని నగదును అపహరించారు. ఆదివారం ఉదయం ఆలయ కమిటీ సభ్యుడు, ఓ భక్తుడు దేవాలయంలోకి వెళ్లగా హుండీల తాళాలు పగులగొట్టి ఉన్నాయి. విషయాన్ని ఆలయ కమిటీ సభ్యుల దృష్టికి తీసుకువెళ్లడంతో పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఇంతెజార్‌గంజ్ సీఐ మల్లేష్, ఎస్సై కిరణ్మయి, క్లూస్ టీం సభ్యులు చేరుకుని పరిశీలించారు. ఆలయంలోని సీసీ కెమెరాలను పరిశీలించగా బ్యాకప్ లేక రికార్డు కాలేదని తేలింది. సుమారు రూ.లక్ష నగదు అపహరించినట్లు ఆలయ కమిటీ సభ్యులు చెబుతున్నారు. సీఐ మల్లేష్‌ను వివరణ కోరగా పాత నేరస్తులే చోరీకి పాల్పడి ఉంటారని, అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.



వివరాలు సేకరిస్తున్న క్లూస్ టీం

పీహెచ్‌సీలో దొంగతనం

- టీవీ, మానిటర్, ఇన్వర్టర్, బ్యాటరీల అపహరణ

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ మండలంలోని మల్యాల గ్రామంలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చోరీ జరిగింది. రూ. 1.50 లక్షల విలువైన మానిటర్, బ్యాటరీలను దొంగలు అపహరించారు. వివరాలిలా ఉన్నాయి. రోజు మాదిరిగానే శనివారం సాయంత్రం 4 గంటలకు సంబంధిత అధికారులు, సిబ్బంది పీహెచ్‌సీని బంద్ చేసి వెళ్లారు. ఆదివారం ఉదయం కాంటిజెన్సీ వర్కర్ కేదారి వచ్చి పీహెచ్‌సీ తాళం తీసి లోపలికి వెళ్లే సరికి టీవీ కనిపించలేదు. పీహెచ్‌సీలోని గదులను పరిశీలించి ఆస్పత్రి మెడికల్ ఆఫీసర్ అన్వేష్, హెల్త్ సూపర్‌వైజర్ పమ్మి నాగబ్రహ్మాచారికి సమాచారం ఇచ్చాడు. వారు పీహెచ్‌సీకి చేరుకుని పరిశీలించి టీవీతోపాటు యూపీఎస్, ఇన్వర్టర్, 3 బ్యాటరీలు, మానిటర్ అపహరణకు గురైనట్లు గుర్తించారు. పీహెచ్‌సీలో గల సీసీ కెమెరాలు పని చేయకపోవడంతో ఎవరు చోరీకి పాల్పడ్డారనే అంశం తెలియలేదు. ఆస్పత్రి అధికారులు కురవి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.



బ్యాటరీలు చోరీకి గురైన దృశ్యం

ఐలోని ఆలయంలో గొలుసు అపహరణ

ఐనవోలు: ఐలోని మల్లికార్జున స్వామి ఆలయంలో శనివారం రాత్రి భక్తురాలి బంగారు గొలుసు చోరీకి గురైంది. యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలం వెంకిరాల గ్రామానికి చెందిన గండు వసంత భర్త, ఇద్దరు కూతుర్లతో శనివారం ఆలయానికి వచ్చింది. ఎల్లమ్మ ఆలయంలో బోనం మొక్కు తీర్చుకుంటుండగా గుర్తు తెలియని దుండగుడు ఆమె మెడలోని 4 తులాల పుస్తెలతాడు లాక్కొని గోడ దూకి పరారయ్యాడు. దీంతో వసంత పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకన్న ఆదివారం తెలిపారు.



సీసీ ఫుటేజీలో అనుమానిత వ్యక్తి

సెల్ షాపులో..



సెల్ షాపులో పరిశీలిస్తున్న ఎస్సై పవన్

మరిపెడ: మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో గల సెల్ షాప్‌లో శనివారం అర్ధరాత్రి చోరీ జరిగింది. వివరాలిలా ఉన్నాయి. స్థానికంగా ఉంటే పొన్నం వినయ్ రామాలయం దారిలో వీఆర్ సెల్ పాయింట్ నిర్వహిస్తున్నాడు. శనివారం రాత్రి షాపు షెడ్డు రేకులను కత్తిరించిన దొంగలు లోనికి ప్రవేశించి సుమారు రూ.లక్ష విలువ చేసే సెల్‌ఫోన్లను ఎత్తుకెళ్లారు. పొన్నం వినయ్ ఫిర్యాదు మేరకు ఎస్సై దూలం పవన్‌కుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు.

గ్రేటర్ 63వ డివిజన్ కార్పొరేటర్‌పై కేసు

మడికొండ: గ్రేటర్ వరంగల్ 63వ డివిజన్ కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్‌పై మడికొండ పోలీస్‌స్టేషన్‌లో భూ ఆక్రమణ కేసు నమోదైంది. ఇన్‌స్పెక్టర్ వేణు కథనం ప్రకారం.. కాజీపేట మండలం సోమిడి శివారులో గల తన 5 గుంటల భూమిని కార్పొరేటర్ జక్కుల రవీందర్ ఆక్రమించాడని అగ్రికల్చర్ ఏడీ నాగేష్ శనివారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో ప్రాథమిక విచారణ జరిపిన పోలీసులు కార్పొరేటర్ భూ ఆక్రమణకు పాల్పడినట్లు నిర్ధారించి కేసు నమోదు చేశారు.

అత్తపై దాడి చేసిన కోడలు అరెస్ట్

మహదేవపూర్: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం ఎడపల్లి గ్రామానికి చెందిన దుర్గం సమత శనివారం తన అత్తపై కొడవలితో విచక్షణారహితంగా దాడి చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు సమతను ఆదివారం అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్సై రాజ్‌కుమార్ తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



రమేష్ (ఫైల్)

చిట్యాల: విద్యుదాఘాతంతో రైతు మృతి సంఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం తిర్మలాపూర్ శివారు రాంచంద్రాపూర్‌లో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన గాజె రమేష్(38) తన మిర్చి పంటకు నీళ్లు కట్టేందుకు చెలక వద్దకు వెళ్లాడు. విద్యుత్ సరఫరా లేకపోవడంతో పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లి ఫ్యూజ్ వైర్ వేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ సరఫరా జరిగి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య లావణ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టెబుల్ ఎండి గౌస్ తెలిపారు. మృతిడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.

చికిత్స పొందుతున్న యువకుడు..

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మండలం మాధవాపురం గ్రామానికి చెందిన తొడుసు నవీన్(24) ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకున్నట్లు కురవి ఎస్సై బి.రాము ఆదివారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. నవీన్ కురవి మండల కేంద్రంలో ద్విచక్రవాహనాల మెకానిక్‌గా పని చేస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో ఈ నెల 17న పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం అతడిని మానుకోట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ నవీన్ శనివారం రాత్రి మృతి చెందాడు. మృతుడి తండ్రి మల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రైలుకింద పడి తాపీమేస్త్రీ ఆత్మహత్య

కాశిబుగ్గ: గుర్తు తెలియని రైలు కిందపడి తాపీమేస్త్రీ ఆత్మహత్య చేసుకున్న సంఘటన వరంగల్–చింతలపల్లి రైల్వేస్టేషన్ల మధ్య ఆదివారం ఉదయం చోటు చేసుకుంది. జీఆర్పీ సీఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లా గీసుకొండ మండలం ధర్మారం గ్రామానికి చెందిన చెలుకలపల్లి అశోక్(42) తాపీమేస్త్రీగా జీవనం సాగిస్తున్నాడు. నాలుగు నెలల క్రితం ధర్మారంలో పనిచేస్తూ బిల్డింగ్ పైనుంచి జారి పడిపోవడంతో చేయి విరిగింది. అప్పటి నుంచి ఇంటి వద్దనే ఉంటున్నాడు. దీంతో పని చేయలేకపోతున్నాననే బాధ, ఆర్థిక ఇబ్బందులతో జీవితంపై విరక్తి చెంది రైల్వే గేటు సమీపంలో గుర్తు తెలియని రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. డిప్యూటీ ఎస్ఎస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని మృతుడి భార్య, కొడుకుకు అప్పగించామని సీఐ తెలిపారు.

జీవితంపై విరక్తి చెంది యువతి..

చిల్పూరు: జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండలం మల్కాపూర్‌కు చెందిన దేవరాజుల నీరజ(22) జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఎస్సై వినయ్‌కుమార్ వివరాల ప్రకారం.. నీరజ డిగ్రీ చదువుతోంది. ఇటీవల తల్లి లక్ష్మి అనారోగ్యంతో మృతి చెందింది. ఈ క్రమంలో కూతురు పెళ్లి చేయాలని తండ్రి పోషయ్య సంబంధం కూడా చూశాడు. అయితే, నీరజ తన తల్లి మృతిని తట్టుకోలేక ఒత్తిడికి గురయ్యేది. ఈ క్రమంలో ఆదివారం ఆత్మహత్య చేసుకుంది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

భార్య పుట్టింటికి వెళ్లిందని..

ఖిలా వరంగల్: పెద్దలను ఎదిరించి ప్రేమ పెళ్లి చేసుకున్నాడు.. తీరా భార్య వదిలేసి పుట్టింటికి వెళ్లడంతో మనస్తాపానికి గురైన యువకుడు ఇంట్లోనే ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. వరంగల్ 41వ డివిజన్ కాశికుంట ప్రాంతానికి చెందిన గండేటి స్వామి – శోభ దంపతుల కుమారుడు జగదీశ్వర్(22) అదే ప్రాంతానికి చెందిన యువతిని రెండేళ్ల క్రితం పెద్దలను ఎదిరించి కులాంతర వివాహం చేసుకున్నాడు. ఏసీలు రిపేర్ చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఏడాదిన్నర తర్వాత ఇరువురి మధ్య గొడవలు ప్రారంభమయ్యాయి. దీంతో భర్తను వదిలేసి ఆ యువతి పుట్టింటికి వెళ్లింది. తిరిగి రావాలని ఎన్నిసార్లు వేడుకున్నా పట్టించుకోలేదు. దీంతో మనస్తాపానికి గురైన జగదీశ్వర్ ఆదివారం రాత్రి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి స్వామి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు మిల్స్‌కాలనీ పోలీసులు తెలిపారు.

చెల్లితో అసభ్య ప్రవర్తన

- చితకబాదిన గ్రామస్తులు
- పోక్సో కేసు నమోదు

నల్లబెల్లి: చెల్లితో అసభ్యకరంగా ప్రవర్తించిన అన్నను గ్రామస్తులు చితకబాదిన సంఘటన ఆదివారం వెలుగులోకి వచ్చింది. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అతడిపై పోక్సో కేసు నమోదైంది. వివరాలిలా ఉన్నాయి. వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం అర్వయ్యపల్లి గ్రామానికి చెందిన బాలిక(17) ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతోంది. స్కాలర్‌షిప్‌నకు దరఖాస్తు చేసేందుకు పాన్‌కార్డు నంబర్ కావాలని అధికారులు అడిగారు. దీంతో పెద్దనాన్న కుమారుడు గుడారపు స్వామి(సలేందర్) సాయం కోరింది. తల్లిదండ్రుల అనుమతితో ఇద్దరూ శనివారం మధ్యాహ్నం హనుమకొండకు వెళ్లి దరఖాస్తు చేశారు. తిరుగు ప్రయాణంలో నల్లబెల్లి మండలం బోల్లోనిపల్లి శివారుకు చేరుకోగానే స్వామి ద్విచక్రవాహనాన్ని దారి మళ్లించి రోడ్డుపక్కన ఉన్న ముళ్లపొదల చాటుకు తీసుకెళ్లే ప్రయత్నం చేశాడు. బాలిక అతడిని నిలదీస్తూ అడ్డుకుని కుటుంబ సభ్యులకు ఫోన్‌లో సమాచారం అందించింది. దీంతో అతడు తన ప్రయత్నాన్ని విరమించుకుని శనివారం రాత్రి ఇంటికి తీసుకువచ్చాడు. అదేవిధంగా మూడు రోజుల క్రితం ఇంట్లో నిద్రిస్తుండగా చొరబడి అసభ్యంగా ప్రవర్తించాడు. ఈ విషయాన్ని బాలిక రోదిస్తూ కుటుంబ సభ్యులకు తెలియజేసింది. గ్రామస్తుల సమక్షంలో స్వామిని నిలదీయగా ఎదురుతిరిగాడు. దీంతో గ్రామస్తులు అతడిని చితకబాది పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు స్వామిపై బాధితురాలి కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజారాం తెలిపారు.

మొక్కజొన్నకు గడ్డి మందు పిచికారీ

- పోలీసులకు బాధితుడి ఫిర్యాదు

చెన్నారావుపేట: మొక్కజొన్న పంటకు గడ్డి మందు పిచికారీ చేసిన సంఘటన వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం ఖాదర్‌పేట గ్రామంలో ఆదివారం వెలుగులోకి వచ్చింది. బాధితుడి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన చాపల మధుకు సంబంధించిన మొక్కజొన్న పంటకు ఆయన మామ కూస శ్రీను, అతడి కుమారుడు రాహుల్, బావమరిది సుధాకర్ గెట్టు పంచాయితీని మనసులో పెట్టుకొని శనివారం రాత్రి గడ్డి మందు పిచికారీ చేశారు. దీంతో మొక్కజొన్న పంట ఎండిపోయి నష్టం వాటిల్లింది. గడ్డి మందు పిచికారీ చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బాధితుడు ఆదివారం చెన్నారావుపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.



గడ్డి మందు పిచికారీ చేయడంతో ఎండిపోయిన మొక్కజొన్న పంట

సీపీ కార్యాలయం ఎదుట యువకుడి అలజడి

- రాజ్యాంగం మార్చాలంటూ నినాదాలు

వరంగల్ క్రైం: వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలోకి ఆదివారం కమలాపూర్‌కు చెందిన దొడ్డ సాయిచరణ్ అక్రమంగా ప్రవేశించడంతో పాటు రాజ్యాంగాన్ని మార్చాలంటూ నినాదాలు చేశాడు. అప్రమత్తమైన పోలీసులు యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. ఆర్ఎస్సై ఎండి ఇక్బాల్‌పాషా సుబేదారి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో యువకుడిపై కేసు నమోదు చేసినట్లు సుబేదారి ఇన్‌స్పెక్టర్ షూకుర్ తెలిపారు.